క్లుప్తంగా

నేడు సాతులూరులో ఆధార్ క్యాంపు

నాదెండ్ల: మండలంలోని సాతులూరు సచివాలయంలో బుధవారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో స్వరూపరాణి చెప్పారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం వరకూ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆధార్‌కార్డులో మార్పులు చేర్పులు, ఫోన్ నెంబరు లింకు చేయబడతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిన్నారులకు నూతన ఆధార్ జారీ చేస్తారన్నారు.

ఫిబ్రవరి 28లోపు వ్యాపార లైసెన్స్ ఫీజులు చెల్లించాలి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వ్యాపార డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులను ఫిబ్రవరి 28 లోపు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వ్యాపార లైసెన్స్ ఫీజులను మీ పరిధిలోని సచివాలయాల్లో, పురపాకల సంఘం ప్రత్యేక కౌంటర్లలో చెల్లించాలని తెలిపారు. ఆన్‌లైన్ పేమెంట్ కూడా చేయవచ్చని వివరించారు.

సాఫ్ట్ స్కిల్ ఉద్యోగాలకు కృష్ణవేణి విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 72 మంది విద్యార్థులు ఐఈసీఈ కంపెనీలో సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో మంగళవారం కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో 124 మంది విద్యార్థులు పాల్గొనగా, టెక్నికల్, హెచ్‌ఆర్ రౌండ్స్ నిర్వహించి 72 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారికి రూ.2.40 లక్షలు వార్షిక వేతనం లభిస్తుందనీ, డిగ్రీ పూర్తిచేసుకున్న వెంటనే ఉద్యోగంలో చేరాలని వివరించారు. కార్యక్రమంలో సంస్థ హెచ్ ఆర్ ప్రతినిధులు ప్రశాంత్‌కుమార్, మల్లేష్, బషీర్, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎం.బాలకోటేశ్వరరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నిర్మల బాలికోన్నత పాఠశాల 10వ తరగతికి చెందిన 50 మంది విద్యార్థినులకు ఉచితంగా అబ్దుల్ కలామ్ థెరిస్సా సేవాసొసైటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి మంగళవారం పంపిణీ చేశారు. పేద విద్యార్థులు స్టడీ మెటీరియల్ ద్వారా బాగా చదివి అత్యున్నత మార్కులు సాధించి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సిద్దార్థి, వార్డెన్లు సిస్టర్ మాణిక్యం సిస్టర్ హాబర్ట్‌లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం, విప్పర్లపల్లి గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లోని పొలాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ప్రస్తుత తరుణంలో మొక్కజొన్న పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలని రైతులకు సూచించారు. మొక్కజొన్న పైరులో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వ్యవసాయ అధికారి శివలలిత వివరించారు.

చేయూతనందించాలి

చిలకలూరిపేట: పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ విద్యా సంస్థలకు చేయూతనందించాల్సిన ఆవశ్యకత ఉందని రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం సభ్యులు తెలిపారు. మండలంలోని రాజాపేట గ్రామంలో ఉన్న గురుకుల పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు మంగళవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సుమారు 400 మంది విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు అందించే ఉద్దేశంతో ఈ ఆర్వోప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వారణాసి కుమార్, కొల్లా సుబ్బారావు, అలంగార్ మోహన్, ప్రసాదరాజు, చెంచుపున్నయ్య పాల్గొన్నారు.

ఏబీవీపీ కోశాధికారిగా...

నరసరావుపేట ఈస్ట్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కోశాధికారిగా పట్టణానికి చెందిన కోడూరు సాంబశివరావు తిరిగి నియమితులయ్యారు.విశాఖపట్నంలో నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర మహాసభలలో సాంబశివరావును రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నూజెల్ల శ్రీనివాస్ ప్రకటించారు. గత 9 సంవత్సరాలుగా రాష్ట్ర కోశాధికారిగా కొనసాగుతున్న సాంబశివరావు మరోమారు కోశాధికారి బాధ్యతలు స్వీకరించనున్నారు. విద్యార్థి దశ నుంచి ఏబీవీపీలో కొనసాగుతూ పట్టణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు బాధ్యతలు నిర్వహించారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

శావల్యాపురం డీటీకి పదోన్నతి

శావల్యాపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో విధులు నిర్వహించుతున్న డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు తహసీల్దారుగా పదోన్నతిపై పెదకూరపాడు మండలం క్రోసూరు మండలం తహసీల్దారుగా నియమాకమైనట్లు తహసీల్దారు కె.సుజాత మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దారు సుజాత మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ పరంగా నాలుగు సంవత్సరాల పాటు మెరుగైన సేవలు అందించి అందరి మన్ననలు పొందారని అన్నారు.

కసరత్తు ‘పది’లం

- మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు
- విద్యార్థులకు సాధన పుస్తకాల పంపిణీ

శావల్యాపురం: పదోవ తరగతి ఫైనల్ పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధించటానికి మండల వ్యాప్తంగా పాఠశాలల్లో కసరత్తు చేస్తున్నారు. సమ్మెటివ్–1 పరీక్ష ఫలితాలు ఆధారంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించి పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పెరగడానికి ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా ఉదయం–సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహణతో సబ్జెక్టు వారీగా టీచర్లు ఉంటూ ప్రత్యేకంగా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. కలెక్టరు పి.అరుణ్ బాబు సారథ్యంలో పదోవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడానికి విద్యార్థులకు అనువుగా ఉండేలా విద్యార్థి సాధన స్టడీ పుస్తకాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పంపిణీ చేస్తోంది.

ఇప్పటికే అన్నీ పాఠశాల్లో పదోవ తరగతి సిలబస్ పూర్తి చేయగా గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిన పాఠశాలలను గుర్తించటంతో పాటు సబ్జెక్టు వారీగా అధిక సంఖ్యలో ఫెయిల్ అయిన పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు దిశ నిర్దేశం చేసి మంచి ఫలితాలు సాధన కోసం చేయాల్సిన విధి విధానాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వివరించారు. 550 మార్కులు పైబడి మంచి ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులను గుర్తించి మార్కులు తక్కువగా వచ్చే సబ్జెక్టుపై ప్రత్యేక తర్ఫీదు ఇచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టారు. విద్యార్థులు ఎక్కడ వెనకబడుతున్నారు? ఎలా చదివితే గుర్తు ఉంటుందీ అన్న అంశాలను విద్యార్థులకు విడమరిచి చెబుతున్నారు.



శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు



విద్యార్థి సాధన పుస్తకాలు అవిష్కరిస్తున్న జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబు (ఫైల్)

పునశ్చరణకే ప్రాధాన్యం ఇవ్వాలి



పదోవ తరగతి విద్యార్థులు రివిజెన్‌కు చాలా ప్రాముఖ్యత ఇవ్వాలి. విద్యార్థులను గ్రేడులను విభజించి తక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలి. జిల్లా కలెక్టరు సారథ్యంలో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేసిన విద్యాసాధన పుస్తకాలను ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు సద్వినియోగమయ్యేలా పర్యవేక్షణ చేయాలి.

–ఎల్.చంద్రకళ, జిల్లా విద్యాశాఖాధికారి

సాధనతోనే సత్ఫలితాలు



విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా వారి సామర్థ్యాలు ఆధారంగా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించటానికి విద్యార్థి సాధన పుస్తకం స్టడీ మెటీరియల్ దోహదపడుతుంది. 30 రోజుల వ్యవధిలో ప్రణాళిక ప్రకారం చదివితే మంచి ఫలితాలు సాధిస్తారు. విద్యార్థులు బట్టి విధానం కాకుండా సులభంగా అర్థం చేసుకొని ప్రశ్నలకు సమాధానం రాయాలి.

–కుమ్మరి శ్రీనివాసరాజు, గణిత ఉపాధ్యాయులు

వైఎస్సార్ సీపీ నాయకుడు మృతికి నివాళి



రొంపిచర్ల: మండలంలోని నల్లగార్లపాడు గ్రామ సర్పంచ్ కట్టా రాజేశ్వరి భర్త వెంకటరెడ్డి సోమవారం రాత్రి మృతి చెందాడు. వెంకటరెడ్డి భౌతికకాయాన్ని మాజీ శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెంకటరెడ్డి గ్రామానికి, పార్టీకీ చేసిన సేవలను కొనియాడారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలియజేశారు.పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు,నాయకులు పాల్గొన్నారు.

4న ములకలూరు వక్ఫ్‌భూముల వేలం

నరసరావుపేట రూరల్: ములకలూరులోని అషూర్ ఖాన్ పీర్ల మస్యంకు చెందిన వక్ఫ్‌భూముల కౌలు వేలంపాటను ఫిబ్రవరి 4వ తేదీన నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి మురళీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సర్వెనెం.676లోని 13.28 ఎకరాల భూమి వ్యవసాయానికి అనువైనదని తెలిపారు. 2025–27 ఆర్థిక సంవత్సరంలో వక్ఫ్‌భూముల బహిరంగ వేలంను గ్రామ సచివాలయంలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల రైతులు రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

వీఓఏల జీతాలు చెల్లించకపోవటం దుర్మార్గం

- ధర్నా చౌక్ వద్ద రెండో రోజు కొనసాగిన వీవోఏల నిరాహార దీక్షలు
- సంఘీభావం తెలిపిన శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ శివకుమారి

నరసరావుపేట: చాలీ చాలనీ వేతనాలు, పనిఒత్తిడి, రాజకీయ వేధింపులను భరిస్తూ విధులు నిర్వర్తిస్తున్న వీవోఏలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం దుర్మార్గమని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి అన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం కోసం ఏపీ వెలుగు వీవోఏ (యానిమేటర్) ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్టేషన్ రోడ్డులోని గాంధీపార్కుకు ఎదురు ధర్నాచౌక్‌లో మంగళవారం నిర్వహిస్తున్న రెండోరోజు రీలే నిరాహార దీక్షలు చేస్తున్న వారికి ఆమె పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సర్క్యులర్ ద్వారా మూడేళ్లు పనిచేసిన వారిని తొలగించే విధానాన్ని తీసుకురావడం అన్యాయమన్నారు. దీంతో వారికి ఉద్యోగ భద్రత లేకుండా పోతుందన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాలు పెరగడం లేదన్నారు. సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంత రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యాన్ని కల్పించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించే దిశగా ఆలోచించాలని లేని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు ఏసమ్మ, కార్యదర్శి తాళ్లూరి రామారావు, వీఓఏలు కోటేశ్వరరావు, షేక్ నన్నేసాహెబ్, శివలీల, మహాలక్ష్మి, సుజాత, ఉషారాణి, జరీనా, సుధామణి, లక్ష్మి, ప్రమీల, అచ్యుత కుమారి, గౌస్య పాల్గొన్నారు.

గీతకార్మికులకు మద్యం షాపు కేటాయింపు

వినుకొండ(నూజెండ్ల): ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ వినుకొండ పరిధిలో వినుకొండ మునిసిపాలిటీలో గౌడ (గీత కార్మికలకు) ఒక షాపు కేటాయించబడిందని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వినుకొండ పటణంలో ఎక్కడైనా షాపును ఏర్పాటు చేసుకోవచ్చని, దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు, ఇది నాన్ రిఫండబుల్ అని, ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు అయితే ఒక షాపు మాత్రమే కేటాయించబడునని వివరించారు. ఈ 27 నుంచి ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, 7న డ్రాలో గెలుపొందిన వారికి అదే రోజు షాప్ కేటాయించబడునని తెలిపారు. పల్నాడు జిల్లాకు చెందిన గౌడ కులస్తులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అయితే సప్లిమెంటరీ క్యాస్ట్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం



రొంపిచర్ల : మండలంలో కొత్తపల్లి గ్రామంలో గల పొలాల్లో గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం రైతులు గుర్తించారు. ఆ గ్రామ రైతులు పొలం పనులకు వెళ్లిన సమయంలో రోడ్డు సమీపంలోని పొలంలో వరి నాట్ల బురదలో కూరుకుపోయిన మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ. మణికృష్ణ పోలీస్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని బురదలో కూరుకుపోయిన మృతదేహాన్ని బయటకు తీయించారు. మాసి పోయిన తెల్లగడ్డంతో, ఆకు పచ్చ రంగు టీ షర్ట్ ధరించి యున్న ఈ వ్యక్తి వయస్సు 65 నుండి 70 సంవత్సరములు వృద్ధుడై ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చూచేందుకు గ్రామంతో పాటు, పరిసర గ్రామస్థులు అధిక సంఖ్యలో అక్కడికి వచ్చారు. మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన వివరములు సేకరిస్తున్నామని ఎస్ ఐ మణికృష్ణ తెలిపారు. కాగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటన పరిసర గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

పరామర్శించిన మహిళా సంఘాల నేతలు

నరసరావుపేట: పిడుగురాళ్ల మండలంలోని గుత్తికొండ అడవుల్లో తమ్మిశెట్టి గ్రీష్మపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనజాగృతి మండలి వ్యవస్థాపక అధ్యక్షురాలు పిడతల రమాదేవి, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనూరి కృష్ణ కుమారీ డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గ్రీష్మను వారు మంగళవారం పరామర్శించి కుటుంబ సభ్యులను అడిగి జరిగిన విషయాలు తెలుసుకున్నారు. గ్రీష్మ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యుల ను అడిగి మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. సోమవారం మల్లిఖార్జున అనే యువకుడు గ్రీష్మను అడవిలోకి తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి గాయపర్చిన విషయం విధితమే. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీష్మకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని, ఇంతటి దుశ్చర్యకు పాల్పడిన నిందితుడిని పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు. నవతరం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షురాలు కంచరగుంట్ల సుజాత, హ్యూమన్ రైట్స్ పల్నాడు ప్రెసిడెంట్ షేక్ నూర్జహాన్, ముస్లిం చైతన్య వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షకీలా, కె.రజనికుమారి పాల్గొన్నారు.

లింగంగుంట్ల అగ్రహారం భూముల సమస్యను తీర్చండి

శ్రీ విద్యా శంకరభరతీ మహాస్వామిని కలసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



హైదరాబాదులో పుష్పగిరిపీఠం విద్యాశంకర భారతీ స్వామికి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట: మండలంలో లింగంగుంట్ల గ్రామంలో ఉన్న పుష్పగిరి పీఠం అగ్రహారం భూముల సమస్యను తీర్చాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కోరారు. మంగళవారం ఆయన సతీసమేతంగా హైదరాబాదులో శ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థానం సందర్శించారు. శ్రీ మాదభినవోద్దండ విద్యాశంకర భారతి మహాస్వామిని సతీసమేతంగా కలిసి స్వామివారి ఆశీర్వచనాలను అందుకున్నారు. కాగా, గ్రామ పరిధిలో గత కొన్నేళ్లుగా రైతుల ఆధీనంలో అగ్రహారం భూములు ఉండటం, అయితే ఆ భూములు పుష్పగిరి పీఠానికే చెందుతాయని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించటం, రైతుల ఆందోళన మధ్య గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పీఠానికి, రైతుల మధ్య ఓ అంగీకారం కుదరటం జరిగింది. ఈ మేరకు పరిష్కార చర్చలు జరుగుతుండగానే ప్రభుత్వం మారటంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. దీనిపై ఎమ్మెల్యే చదలవాడ మహాస్వామితో భూముల విషయంపై చర్చించారు. సమస్యను తీర్చే విధంగా సహకరించాలని కోరారు.

మహిళల సర్వతోముఖాభివృద్ధికి కృషి

నేడు ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న డాక్టర్ కందిమళ్ల

చిలకలూరిపేట: మహిళల సర్వతోముఖాభివృద్ధికి తమ సంస్థ కృషి చేస్తోందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. బుధవారం ఒయాసిస్ సంస్థ 18వార్షికోత్సవ వేడుకలు నిర్వహించుకోనుంది. ఈ సందర్భంగా కేజే ఆసుపత్రి ప్రాంగణంలో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయమ్మ మాట్లాడుతూ 18 సంవత్సరాల కిందట కేవలం 11 మంది మహిళా సభ్యులతో ఏర్పాటైన తమ సంస్థ నేడు 160 మంది సభ్యులకు చేరుకుందని, సుమారు రూ. 7కోట్ల సేవా కార్యక్రమాలు దాతలు, సభ్యుల సహకారంతో నిర్వహించామని వెల్లడించారు. మహిళాభ్యుదమే లక్ష్యంగా తమ సంస్థ ప్రస్థానం కొనసాగుతోందని వివరించారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 18వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం సాయంత్రం పట్టణంలోని రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్నట్లు డాక్టర్ జయమ్మ తెలిపారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరు కానున్నారని, ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, కందిమళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

డ్రైవర్లు ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులకు భద్రత

ఆర్టీసీలోని భద్రతా వారోత్సవాల్లో జిల్లా రవాణా అధికారి సంజీవ్‌కుమార్



మాట్లాడుతున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు

నరసరావుపేట: డ్రైవర్లు అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు కృషిచేయాలని, వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులకు భద్రత లభిస్తుందని జిల్లా రవాణా అధికారి (ఆర్టీవో) జి.సంజీవకుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్టీవో మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలను నడిపే సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యస్.శివనాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాలు ఏవిధంగా జరుగుతాయో వాటిని ఏవిధంగా తప్పించుకోవచ్చునో వివరంగా తెలియచేశారు. అనారోగ్యానికి గురైన వారికి సీపీఆర్ చేసే విధానం డెమో ద్వారా చూపించారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వంశీకృష్ణ, రవాణా శాఖ డాక్టర్ నవ్య, రోడ్డుసేఫ్టీ ఎన్‌జీవో సభ్యులు బంగారయ్య, గ్యారేజ్ ఇన్‌చార్జి లావణ్య, వివిధ డిపోల నుంచి డ్రైవర్లు, సూపర్‌వైజర్లు, మెకానిక్‌లు, అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలో రీసర్వే పనులు జరగాలి

తహసీల్దారు కె.సుజాత



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు సుజాత

శావల్యాపురం: రీసర్వే పనులు రైతుల సమక్షంలో జరగాలని తహసీల్దారు కె.సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తలూరు గ్రామ సచివాలయంలో రీసర్వే పనులపై రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో 4500 ఎకరాలు విస్తీర్ణంలో భూములు ఉండగా ఫిబ్రవరి 10 లోగా భూములకు సంబంధించి సరిహద్దులను రోవర్ ఆధునీకరణ యంత్ర పరికరాలు ద్వారా కొలతలు పనులు పూర్తి చేసి అనంతరం రైతుల సమక్షంలో భూములు కొలతలు సరిహద్దులను గుర్తించి రెవెన్యూ అధికారులు ఆన్‌లైన్ నమోదు చేస్తామన్నారు. భూములు కొలతలు పూర్తి అయిన రైతులకు మూడు రోజుల ముందుగా నోటీసులు అందజేస్తామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెవెన్యూ అధికారులకు రైతులు లిఖిత పూర్వకంగా తగిన ఆధారాలను అందజేస్తే సత్వరమే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామసభలో రైతుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, మండల సర్వేయర్ రాజు, వీఆర్వో ఉప్పులూరి చిన మంగయ్య, సచివాలయ సర్వేయర్ గురుబ్రహ్మం పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన వాగ్దేవి విద్యార్థులు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, హెచ్‌ఆర్ ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఐఈసీఈ కాకినాడ సంస్థ నిర్వహించిన జాబ్ ఫెయిర్‌లో 24 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థులకు డిగ్రీ విద్యతో పాటు ఎంఎంసీ కంపెనీలలో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన శిక్షణను డిగ్రీ ప్రథమ సంవత్సరం నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకున్న వెంటనే విధుల్లో చేరాల్సి ఉంటుందనీ, రూ.2.5 లక్షలు నుంచి 3.2 లక్షల వరకు వార్షిక వేతనం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, ఓగూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం



నరసరావుపేటటౌన్: మండల న్యాయ సేవాధికార సంస్థ, బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కోర్టు ప్రాంగణంలో యూనికేర్ హోమియోపతి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్. సత్యశ్రీ మాట్లాడుతూ అన్నిరకాల దీర్ఘకాలిక సమస్యలకు హోమియోపతి మందులు చాలా ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా శాశ్వతంగా సమస్యలను పరిష్కరించుకోవడానికి హోమియోపతి మందులు చాలా ఉపయోగకరం అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.నాగేశ్వరరావు, డాక్టర్ మదీన అష్రఫ్, డాక్టర్ వెంకటేష్ కుమార్, మేనేజర్ శ్రీనివాసాచారి మరియు సిబ్బంది పాల్గొన్నారు. మొదట న్యాయాధికారులు న్యాయవాదులకు,కోర్టు సిబ్బందికి కక్షిదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు . ఈ శిబిరంలో సుమారుగా 165 మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావల్సిన మందులు పంపిణీ చేసారు.

నందీశ్వరుడు కదా...



మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో గల బాల త్రిపుర సుందరీ సమేత శంకర స్వామి ఆలయంలోని నందీశ్వరుని చుట్టూ స్టీల్‌తో చేసిన గ్రిల్స్‌ను గ్రామానికి చెందిన గరికపాటి వీరయ్య జ్ఞాపకార్థం వారి ధర్మపత్ని నరసమ్మ, కుమారుడు వెంకటేశ్వర్లు, కోడలు వెంకాయమ్మ అందజేశారు. రూ.30 వేల రూపాయల విలువ చేసే గ్రిల్స్‌ను నందీశ్వరుని చుట్టూ మంగళవారం అమర్చి ప్రత్యేక పూజలు చేశారు. గ్రిల్స్ అందించిన దాతలను భక్తులు, గ్రామస్తులు అభినందించారు. –రొంపిచర్ల

నిద్ర ఆవహించి...



మండలంలోని మర్రిచెట్టుపాలెం, సంతగుడిపాడు గ్రామాల మధ్య శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై లోడ్ లారీ మంగళవారం తెల్లవారుజామున ఫల్టీ కొట్టింది. మద్రాసు నుంచి పౌడర్ లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తుండగా కోల్డ్ స్టోరేజ్ సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల లారీ అదుపు తప్పి రోడ్డు ప్రక్కకు దూసుకెళ్లి ఫల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. – రొంపిచర్ల

కూటమి ప్రభుత్వం హామీని నిలబెట్టుకోవాలి



బొల్లాపల్లి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మండల కార్యదర్శి పి. వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కనుమలచెరువు గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాల విషయంలో మంగళవారం ర్యాలీ నిర్వహించి సచివాలయ సిబ్బంది (ఇంజనీరింగ్ అసిస్టెంట్) కోటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు, ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద లబ్ధిదారునికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన విధంగా ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందికి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.